క్లుప్తంగా

హౌసింగ్ లే అవుట్ల పరిశీలన


ఎంబుక్ పరిశీలిస్తున్న డీఈ రామ్మూర్తి

యల్లనూరు: మండలంలోని నిట్టూరు గ్రామంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కింద నిర్మించిన మట్టి రోడ్ల హౌసింగ్ లే అవుట్లను మంగళవారం హౌసింగ్ డీఈ రామ్మూర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ నిట్టూరు గ్రామంలో నూతనంగా వేసిన లే అవుట్‌లో ఉపాధి హామీ పథకం కింద రూ.60 వేలతో 42 మీటర్లతో రోడ్లు వేశామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏపీఓ బబ్లూ, టెక్నికల్ అసిస్టెంట్ జయరాం తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణతో ఉజ్వల భవిష్యత్


మాట్లాడుతున్న కేసీ హరి

గుంతకల్లు: ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్య శిక్షణతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని శ్రీ శంకరనంద గిరి స్వామి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కేసీ హరి సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కళాశాల డిగ్రీ విద్యార్థులకు ప్రొడక్టివిటీస్, ఎన్‌హాన్స్‌మెంట్ టూల్స్ అనే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుంటే నైపుణ్యతపై అవగాహన కల్గి మంచి ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ గోపాల్, సంస్థ శిక్షకుడు సతీష్‌కుమార్, కోఆర్డినేటర్ శ్రీవాణి, కెరియర్ ప్రమోషన్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సజావుగా 'ప్రజా వేదిక'

యల్లనూరు: ప్రజావేదిక గ్రామ సభ సజావుగా సాగింది. మండలంలో ఉపాధి పథకం కింద 2023–2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.18 కోట్ల మేర పనులకు ఖర్చు పెట్టారు. 21 పంచాయతీల్లో సామాజిక తనిఖీ బృందం తిరిగి డీఆర్పీలు నివేదికలు తయారు చేశారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన సామాజిక తనిఖీ ప్రజావేదికకు డ్వామా పీడీ సలీంబాషా, అడిషనల్ పీడీ సుధాకర్‌రెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి పర్వీజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలో 21 పంచాయతీల్లో కలిపి రూ.72 వేలు రికవరీకి ఆదేశించారు. ఎంపీడీఓ వాసుదేవరెడ్డి, పీఆర్ జేఈ నరేంద్ర, ఏపీఓ షబ్బీర్‌బాషా, టెక్నికల్ అసిస్టెంట్లు ప్రతాప్, జయరాం, శంకర్, శ్రీనివాసులు, అదిల్, ఫీల్డ్ అసిస్టెంట్లు వెంకట్రామిరెడ్డి, మల్లారెడ్డి, చింతలరాయుడు, నాగభూషణం, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి


తహసీల్దార్ ఈరమ్మకు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

గార్లదిన్నె: న్యాయం చేయాలంటూ మండలంలోని ఓబులాపురం గ్రామస్తులు మంగళవారం తహసీల్దార్ ఈరమ్మకు వినతి పత్రం అందజేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో ఎల్‌పీ నెంబర్ 249 (పాత సర్వే నంబర్ 57–1)లో గత కొన్నేళ్లుగా గ్రామస్తులు ఇళ్లు, కల్లాలు ఏర్పాటు చేసుకుని నివాసం ఉంటున్నామన్నారు. గతంలో తహసీల్దార్లు ఆ భూమిని గ్రామ కంఠం భూమిగా నిర్ధారించి సబ్ డివిజన్ కూడా చేశారన్నారు. ప్రస్తుతం రెవెన్యూ అధికారులు గ్రామ కంఠం భూమి వేరే వారికి పట్టా ఉందని, అందుకు సర్వే చేస్తామని, వాట్సాప్ గ్రూపులకు మేసేజ్‌లు పంపి గ్రామస్తులను భయాందోళనకు గురి చేస్తున్నారన్నారు. గ్రామ కంఠం భూమిని సర్వే చేయరాదన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రం తహసీల్దార్ ఈరమ్మకు అందజేశారు. వెంటనే స్పందించిన తహసీల్దార్ ఈరమ్మ గ్రామ కంఠం భూమిని సర్వే చేయమని, పూర్తి విచారణ చేసి న్యాయం చేస్తామని గ్రామస్తులకు సూచించారు.

ఘనంగా గంగమ్మతల్లి గ్రామోత్సవం


అలంకరణలో గంగమ్మతల్లి

పెద్దపప్పూరు: మండల కేంద్రంలో మంగళవారం గంగమ్మ తల్లి గ్రామోత్సవం ఆలయ పర్యవేక్షకులు ఘనంగా నిర్వహించారు. పరిసర గ్రామాలనుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారికి పసుపు కుంకుమ సమర్పించారు. భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అమ్మవారిని ప్రతిష్ఠించి మండలం అయిన సందర్భంగా వేడుకలు నిర్వహించినట్లు కాలనీవాసులు తెలిపారు.

అగ్గి రేగితే ఆపేదెలా?

- కాలం చెల్లిన వాహనంతో ఇబ్బందులు
- 50 కిలో మీటర్లకు ఒకే వాహనం
- పట్టించుకోని అధికారులు


తాడిపత్రి ఫైర్‌స్టేషన్


కాలం చెల్లిన వాహనం

తాడిపత్రి రూరల్: వేసవి అంటే ఎండలతో పాటు అగ్ని ప్రమాదాలు కూడా భయపెడుతుంటాయి. ఏటా అగ్ని ప్రమాదాల్లో కోట్లాది రూపాయల ఆస్తులు బుగ్గవుతున్నా ఆ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. తాడిపత్రి నియోజక వర్గంలోని తాడిపత్రి పట్టణం, మండలం, పెద్దపప్పూరు, యాడికి మండలాల పాటు శింగనమల నియోజక వర్గంలోని పుట్లూరు, యల్లనూరు మండలాలు, వైఎస్సార్ జిల్లాలోని రైల్వే కొండాపురం మండలంలో ఎక్కడ అగ్ని ప్రమాదం జరిగినా తాడిపత్రి పట్టణం నుంచి ఫైర్ ఇంజన్ వెళ్లాల్సిందే. ఆయా మండలాల పరిధి 50 కిలోమీటర్ల వరకూ ఉంటోంది. తాడిపత్రి పట్టణంలోని ఫైర్ స్టేషన్‌లో కేవలం ఒకే వాహనం ఉంది. ఈ వాహనం అన్ని మండలాలను కవర్ చేయాల్సి వస్తోంది. ఒకే సారి రెండు మూడు చోట్ల అగ్ని ప్రమాదాలు జరిగితే ప్రమాద తీవ్రతను బట్టి ఒక చోటకు వెళ్తే మిగతా ప్రాంతాల్లో ప్రమాదాలను నివారించలేకపోతున్నారు.

1961లో తాడిపత్రిలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు

తాడిపత్రి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో 1961లో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేశారు. అప్పట్లో రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించారు. అనంతరం ఫైర్ స్టేషన్ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో అక్కడి నుంచి తాత్కాలికంగా పుట్లూరు రోడ్డులోని రైస్ మిల్లు వద్ద ఉన్న డీసీఎం భవనంలోకి మార్చారు. మరమ్మతుల అనంతరం తిరిగి ఆర్టీసీ బస్టాండ్‌లోని సొంత బిల్డింగ్‌లోకి మార్చారు. ప్రారంభంలో ఫైర్ స్టేషన్‌కు మూడు వాహనాలు కేటాయించారు. అనంతరం చోటు చేసుకున్నా పరిణామాల వల్ల ఒకే వాహనానికి పరిమితం చేశారు. 2009లో ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల ఫైర్ స్టేషన్ భవనంతోపాటు కోట్లాది రూపాయల విలువైన రెండు ఎకరాల స్థలాన్ని మునిసిపల్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ స్థలంలో మునిసిపల్ అధికారులు షాపింగ్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేసి టెలిఫోన్ ఎక్సేంజ్ వద్ద కొత్త మునిసిపల్ కార్యాలయ భవనం పక్కన 70 సెంట్ల విస్తీర్ణంలో ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు.

2024–25లో 77 అగ్ని ప్రమాదాలు

తాడిపత్రి ఫైర్ స్టేషన్ పరిధిలో 2024–25 సంవత్సంలో 77 అగ్ని ప్రమాదాలు జరిగాయి. వారిలో 6 రెస్క్యూ ఆపరేషన్‌లు జరిగాయి. పరిధి ఎక్కువ కావడం, అగ్ని ప్రమాదాల సంఖ్య ఎక్కువ కావడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. తాడిపత్రి ప్రాంతానికి అవసరమైన సిబ్బంది నియామకం జరగలేదు. ఉన్న సిబ్బందితో విధులను నిర్వహించాల్సి పరిస్థితి ఏర్పడుతోంది. ఫైర్‌స్టేషన్‌లో 19 మంది సిబ్బంది ఉన్నారు. వారిలో ఫైర్ ఆఫీసర్, డ్రైవర్లు 3, మిగిలిన వారు సిబ్బంది ఉంటున్నారు.

17 ఏళ్లుగా ఒకే వాహనం

ప్రస్తుతం ఫైర్ స్టేషన్‌లో ఉన్న వాహనం 17 ఏళ్లగా సేవలను అందిస్తోంది. 2008లో ఫైర్ స్టేషన్‌కు కొత్తగా వాహనాన్ని కేటాయించారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం 15 ఏళ్ల దాటిన వాహనాలను కాలం చెల్లినవిగా మూలకు పడేస్తారు. కానీ ఈ వాహనాన్ని మాత్రం తాత్కాలిక మరమ్మత్తులతో వాడుకుంటున్నారు. ఎఫ్‌సీకి పంపితే ఎలాంటి మరమ్మత్తులు చేయకుండా కాలం చెల్లిన వాహనం పేరుతో తిరిగి పంపారు.

ఎన్‌ఓసీ పట్ల నిర్లక్ష్యం

తాడిపత్రి పట్టణంలోని పలు ఆసుపత్రులు, స్కూళ్లు, భారీ కట్టడాల యజమానులు ఫైర్ శాఖ నుంచి ఎన్‌ఓసీ తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. గతంలో ఎన్‌ఓసీ తీసుకున్న వారు సైతం రెన్యూవల్ చేయడంలో జాప్యం చేస్తున్నారు. భద్రతా పరిమాణాలను అనుగుణంగా నిర్మాణాలు జరగకపోవడంతో రోగులు, విద్యార్థులు ప్రమాద అంచున ఉండాల్సి వస్తోంది. ఐదేళ్ల క్రితం వరకు ఎన్‌ఓసీని స్థానిక ఫైర్ అధికారులు మంజూరు చేసేవారు. ప్రస్తుతం అన్‌లైన్‌లో ఎన్‌ఓసీకి దరఖాస్తు చేసుకుంటే విజయవాడ నుంచి అనుమతులు ఇవ్వడం జరుగుతుంది. దీతో అనుమతులు ఆస్పత్రులు, పాఠశాల యాజమాన్యులు అనుమతి తీసుకోవడంతో నిర్లక్ష్యం చేస్తున్నారు.

కొత్త వాహనానికి ప్రతిపాదనలు పంపాం



తాడిపత్రి ఫైర్ స్టేషన్‌కు కొత్త వాహనం కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. ప్రస్తుతం ఉన్న వాహనంతోనే సేవలు కొనసాగిస్తున్నాం. ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయిస్తూ ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. వేసవి ఎండల తీవ్రత ఎక్కువ ఉండటంతో సిబ్బందిని అప్రమత్తంగా ఉండాలని ఆదేశించాం.

– మోహన్‌బాబు, ఫైర్ ఆఫీసర్

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


మాట్లాడుతున్న జడ్జి శ్రీహరి

పామిడి: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని గుత్తి రో అదనపు జిల్లా జడ్జి శ్రీహరి సూచించారు. మంగళవారం స్థానిక కస్తూరిబా గాంధీ బాలికాలయంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. బాలికలపై అఘాయిత్యాలను అరికట్టి, సత్వర న్యాయం చేకూర్చడంలో న్యాయసేవాధికార సంస్థ ఎంతగానో తోడ్పడుతుందన్నారు. బాలబాలికల పరిరక్షణకు రాజ్యాంగం రూపొందించిన చట్టాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఓ సౌభాగ్యలక్ష్మి, ప్యానల్ అడ్వకేట్ గంగాధర్, సోషల్ వర్కర్ బాలాజీ, కోర్టు టైపిస్టు సాదిక్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, పారా లీగల్ వర్కర్ ఇస్మాయిల్, ఉపాధ్యాయినులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

దంతాలను సంరక్షించుకోండి


దంతాల సంరక్షణ గురించి వివరిస్తున్న వైద్యురాలు

గుత్తి రూరల్: విద్యార్థులు ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతోపాటు దంతాలను సంరక్షించుకోవాలని గుత్తి ప్రభుత్వాస్పత్రి దంత వైద్యురాలు ప్రశాంతి సూచించారు. మండలంలోని బేతాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం వరల్డ్ ఓరల్ హెల్త్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బేతాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఆమె మాట్లాడుతూ విద్యార్థులు రోజూ దంతాలను శుభ్రం చేసుకోవాలన్నారు. మార్చి 20 నుంచి ఏప్రిల్ 20 వరకూ మండలంలోని అన్ని పాఠశాలలు, గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించి విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం మహాలక్ష్మి, ఉపాధ్యాయులు రామకృష్ణయ్య, ఓబుళపతి, వైద్య సిబ్బంది లాజరస్, ఆంజనేయులు, శ్యామల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పన్ను మొత్తం చెల్లిస్తే సగం వడ్డీ మాఫీ

గుంతకల్లుటౌన్: 2024–25 ఆర్థిక సంవత్సరం వరకూ ఉన్న ఆస్తి, ఖాళీ స్థలం పన్ను బకాయిలను ఒకే విడతలో చెల్లించిన వారికి మొత్తం వడ్డీలో సగం వడ్డీ మాఫీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ పేర్కొన్నారు. ఆస్తి పన్ను బకాయిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

అంగన్‌వాడీలకు శిక్షణ

గుత్తి: పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో జరుగుతున్న అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమాన్ని పీడీ నాగమణి మంగళవారం పర్యవేక్షించారు. ఇన్‌చార్జ్ సీడీపీఓ భారతి, సూపర్ వైజర్లు నాగేశ్వరి, గౌరి, కృష్ణవేణి తదితరులు అంగన్‌వాడీలకు శిక్షణ ఇస్తున్నారు.

నలుగురు మట్కా బీటర్ల అరెస్ట్

పామిడి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద మట్కా రాస్తున్న నలుగురు బీటర్లను అరెస్టు చేశామని సీఐ వీ యుగంధర్ మంగళవారం రాత్రి తెలిపారు. వారి నుంచి రూ.4300 నగదుతో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

నేడు ప్రజావేదిక

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో బుధవారం 17వ విడత ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బారెన్ సాహెబ్ మంగళవారం తెలిపారు. సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు హాజరు కావాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని రజాపురం గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం వేకువజామున కారు మట్టికుప్పను ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. నంద్యాలలోని సాయిబాబా నగర్‌కు చెందిన జిలాన్‌బాషా, సురేష్ కారులో గుంతకల్లుకు బయలుదేరారు. అయితే రజాపురం గ్రామ శివారులో రహదారిపై గురుకుల పాఠశాల ఎదురుగా కల్వర్టు నిర్మిస్తున్నారు. దీంతో అక్కడ మట్టి కుప్ప వేసి రోడ్డు డైవర్షన్ చేశారు. అది గమనించకుండా నేరుగా వెళ్లి కారు మట్టి కుప్పను ఢీకొని అదుపుతప్పింది. మాదంలో కారు నుజ్జునుజ్జై జిలాన్‌బాషాకు తీవ్ర గాయాలు కాగా సురేష్ స్వల్పంగా గాయపడ్డాడు. జిలాన్‌బాషాను వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అతడిని కర్నూలుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పామిడి: పట్టణ కస్తూరిబా గాంధీ బాలికాలయంలో 6 వ తరగతి నుంచి జూనియర్ ఇంటర్ ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌ఓ సౌభాగ్యలక్ష్మి సూచించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ 6వ తరగతిలో 40, 7వ తరగతి–2, జూనియర్ ఇంటర్–48 ఖాళీ సీట్లకు వచ్చే నెల 11లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు, వికలాంగులు, అనాథ పిల్లలకు ప్రాధాన్యం ఉంటుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

తాడిపత్రి: మండలంలోని రావివెంకటాంపల్లి వద్ద ఆటో మోటార్ సైకిల్‌ను ఢీ కొన్న ప్రమాదంలో మంగళవారం మాలపాటి ధనలక్ష్మి అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. తాడిపత్రి పట్టణంలోని ఓ పాఠశాలలో చదువుతున్న కుమారుడికి క్యారీ ఇచ్చేందుకు రాజు, ధనలక్ష్మి దంపతులు బైక్‌పై పట్టణానికి వచ్చి తిరుగు ప్రయాణంలో రావివెంకటాంపల్లికి వెళ్తుండగా ఆటో బైక్‌ను ఢీ కొట్టి వెళ్లిపోయింది. ఘటనలో ధనలక్ష్మికి తీవ్రగాయాలవగా, మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. రాజుకు స్వల్పగాయాలయ్యాయి. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

'ప్రతి రైతునూ ఆదుకుంటాం'

పుట్లూరు: ఈదురు గాలులకు పంటలు, పండ్ల తోటలు దెబ్బతిని నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటామని ఎమ్మెల్యే బండారు శ్రావణి తెలిపారు. మంగళవారం ఆమె మండలంలోని ఎల్లుట్ల, జంగంరెడ్డిపేట, మడ్డిపల్లి తదితర గ్రామాల్లో పంట నష్టాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ తనిఖీ

గుత్తి: పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను మంగళవారం మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా తనిఖీ చేశారు. ముందుగా ఆయన రికార్డులు పరిశీలించారు. అనంతరం భోజనం నాణ్యత, తాగునీటిని పరిశీలించారు. నాణ్యమైన భోజనం పెట్టాలని, క్యాంటీన్‌ను శుభ్రంగా ఉంచుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోండి

శింగనమల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు పట్టాదారు పాసు పుస్తకం కలిగిన ప్రతి రైతూ రైతు సేవా కేంద్రాల్లో కొత్తగా ఐడీ నంబరు నమోదు చేయించుకోవాలని ఏఓ అన్వేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పీఎం కిసాన్, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర సంక్షేమ పథకాలకు ఐడీ ఉపయోగపడుతుందన్నారు.

సజావుగా మండల సమావేశం


పుట్లూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి


పెద్దపప్పూరులో మాట్లాడుతున్న తహసీల్దార్ బాలాజీరాజు

పుట్లూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ రాఘవరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సజావుగా సాగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారు శ్రావణి ముఖ్య అతిథిగా హాజరై ప్రజా ప్రతినిధుల నుంచి సమస్యలను విని పరిష్కరిస్తామన్నారు. అనంతరం అధికారులు వారి శాఖల్లో చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ ఆంజనేయులు, తహసీల్దార్ శేషారెడ్డి, ఎంపీడీఓ అలివేలమ్మ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ వెంకటరామిరెడ్డి, తహసీల్దార్ బాలాజీరాజు, ఎంపీడీఓ శంకుంతల మాట్లాడుతూ తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఇటీవల గాలివానకు న నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి


మున్సిపల్ చైర్‌పర్సన్ భవానికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రజారోగ్య పరిరక్షణకు చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతి డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించడంలో కమిషనర్ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ మంగళవారం సీపీఎం నాయకులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కమిషనర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పట్టణంలోని సీఐటీయూ తదితర శివారు కాలనీల్లో మౌలిక వసతులను కల్పించాలని, సురక్షితమైన తాగునీటిని సరఫరా చేయాలని, పారిశుధ్యం మెరుగుపరచాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్.భవానికి అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగరాజు, కసాపురం రమేష్, రంగమ్మ, సురేంద్ర, సి.రమేష్, జగ్గిలిరమేష్, ఎస్.కె.ఎం.బాషా తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' బిల్లులు వెంటనే ఇవ్వాలి


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

గార్లదిన్నె: ఉపాధి కూలీలకు బకాయి బిల్లులు వెంటనే మంజూరు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని జంబులదిన్నె చెరువు వద్ద జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వేసవి కాలం కావడంతో పనులు జరిగే ప్రాంతంలో నీడ సౌకర్యం, మజ్జిగ, ప్రథమ చికిత్స మందులు ఇవ్వాలన్నారు. గత తొమ్మిది వారాలుగా బిల్లులు రాక కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఉగాది పండుగకు బిల్లులు మంజూరు చేయాలన్నారు. కూలీలకు కనీస కూలి రోజుకు రూ.500 ఇవ్వాలన్నారు. ఉపాధి కూలీలకు ఆటో చార్జీల కింద అదనంగా రూ.50 చెల్లించాన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు. చెన్నారెడ్డి, రైతు సంఘం మండల అధ్యక్షుడు వలి, రైతులు పాల్గొన్నారు.

తెలుగు తమ్ముళ్ల హంగామా

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట తెలుగు తమ్ముళ్లు హంగామా చేశారు. పోలీసుల వివరాల మేరకు.. మండల కేంద్రంలో బేల్దారు లింగమయ్య అనే వ్యక్తి కూలి పనులకు రావాలని బేల్దార్ రాము, నాగేశ్వరికి రూ.2 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చాడు. అయితే వీరు ఆరోగ్యం బాగ లేదని కొద్ది రోజుల నుంచి పనికి వెళ్లలేదు. దీంతో తన డబ్బులు ఇవ్వాలని బేల్దార్ లింగమయ్య డిమాండ్ చేశాడు. ఇంటి వద్దకు వచ్చి డబ్బులు ఇవ్వాలని బెదిరిస్తున్నాడని బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు లింగమయ్య స్టేషన్‌కు రావాలని సీఐ కరుణాకర్ సూచించారు. దీంతో స్థానిక టీడీపీ నాయకుడు రామయ్యను వెంట పెట్టుకుని లింగమయ్య స్టేషన్‌కు వెళ్లాడు. లింగమయ్యతో సీఐ మాట్లాడుతుండగా మధ్యలో టీడీపీ నాయకుడు రామయ్య కల్పించుకున్నాడు. పోలీస్ స్టేషన్‌లో మీ పెత్తనం ఏంటి అంటూ సీఐ, రామయ్య మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ నాయకులు స్టేషన్ ఎదుట బైఠాయించి హంగామా చేశారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులకు సర్దిచెప్పి పంపించేశారు.

కల్లు గీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న నాయకులు

గుంతకల్లు రూరల్: కల్లు గీత కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సంఘం జిల్లా కార్యదర్శి రఘు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని తిమ్మాపురంలో కల్లుగీత కార్మికుల సంఘం సమావేశాన్ని నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి రాములాయల్, సహాయ కార్యదర్శి రమాంజనేయులు మాట్లాడుతూ కల్లు గీత కార్మికులకు వెంటనే గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, ఎక్సైజ్ శాఖ వారు ఈత మొక్కలను అందజేయాలన్నారు. పనిముట్లు అందించడంతో పాటు, టీఎఫ్‌టీ లైసెన్సు ఇవ్వాలని, 50 సంవత్సరాలు పైబడిన కార్మికులకు పెన్షన్లు మంజూరు చేయాలని, కార్మికులకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల ఇళ్ల స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సంగమేష్, మండల అధ్యక్ష కార్యదర్శులు సుధాకర్ గౌడ్, గంగాధర్ గౌడ్, హనుమంతులచ రంగనాయకులు, ఈరన్న, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

'మోసం చేయడం చంద్రబాబు నైజం'

బుక్కరాయసముద్రం: ప్రజలను నమ్మించి మోసం చేయడం సీఎం చంద్రబాబు నైజమని జెడ్పీటీసీ భాస్కర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీటీసీ చాంబర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో విద్యావ్యవస్థ నిర్వీర్యమైందన్నారు. మధ్యాహ్న భోజనం నాసికరంగా అందిస్తూ పిల్లల కడుపు కొడుతున్నారని విమర్శించారు. లోకేష్ పేరుకే విద్యాశాఖ మంత్రి అని, ఆ శాఖపై ఏమాత్రం పట్టు లేదన్నారు. రాష్ట్రంలో వసతి గృహాల్లో సరైన పర్యవేక్షణ లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదరికం వల్ల పిల్లలు విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశ్యంతో విద్యా సంస్కరణలు తీసుకువచ్చారని గుర్తుచేశారు.

కోయిల్ అళ్వార్ తిరుమంజనం


శ్రీవారికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: ఉగాది పండుగను పురస్కరించుకుని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమం నిర్వహించారు. పచ్చ కర్పూరంతో ఆలయాన్ని మొత్తం శుద్ధి చేశారు. అనంతరం స్వామివారికి పూజా కార్యక్రమాలను నిర్వహించి భక్తులకు దర్శనాన్ని కల్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి, కార్యదర్శి నారాయణ స్వామి, సభ్యులు వేల్పూరి రవి, జయంతి వెంకట్, ప్రవీణ్, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలం పరిశీలన

తాడిపత్రి: మండలంలోని ఇగుడూరు గ్రామంలో వివాదాస్పద శ్మశాన వాటిక స్థలాన్ని మంగళవారం ఆర్డీఓ కేశవనాయుడు పరిశీలించారు. నాలుగు రోజుల క్రితం ఇద్దరు ఎస్సీ మహిళలు మృతి చెందగా గ్రామానికి చెందిన పలువురు శ్మశానంలో వారి మృతదేహాలను ఖననం చేసేందుకు ఒప్పుకోలేదు. రెవెన్యూ అధికారులు సైతం అందుకు వత్తాసు పలకడంతో గ్రామంలోని ఎస్సీలు అధికారులు, పోలీసులతో వాగ్వాదం చేసి, శ్మశానవాటికలో మృతదేహాలను ఖననం చేశారు. ఆర్డీఓ పరిశీలనతో శ్మశాన స్థలం త్వరగా కేటాయిస్తే బాగుంటుందని గ్రామంలోని ఎస్సీలు అభిప్రాయం వ్యక్తం చేశారు.

'పనిభారం తగ్గించండి'

యల్లనూరు: పనిభారం తగ్గించాలని పంచాయతీ కార్యదర్శులు మంగళవారం ఎంపీడీఓ వాసుదేవరెడ్డికి వినతిపత్రం అందించారు. కూటమి ప్రభుత్వం అన్ని పనులను పంచాయతీ కార్యదర్శులతో చేయిస్తోందని పనిభారం పెరిగి, ఇబ్బందులు పడుతున్నామన్నారు. మనశ్శాంతి లేక అనారోగ్యం పాలవుతున్నామని ఆందోళన చెందుతున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మాబు, సలీం. సురేష్, సోమేశ్వర్, స్నేహ, నర్మద, యమున తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

గార్లదిన్నె: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని గార్లదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ గౌతమి అన్నారు. మంగళవారం గార్లదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే గ్రామ కమిటీలు, పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం బాల్య వివాహాలు నివారణ, లింగ వివక్షతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేష్, సీహెచ్‌ఓ లోక్‌నాథ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లోకాయుక్తాలో ఫిర్యాదు

పామిడి: పట్టణంలోని ప్రభుత్వ స్థలాల సంరక్షణలో తహసీల్దార్, పంచాయతీ ఈఓ తదితర అధికారుల అలసత్వంపై కర్నూలు లోకాయుక్తాలో ఫిర్యాదు చేసినట్లు ఐక్యమాదిగ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వంకరాజుకాలువ వెంకటేష్ మంగళవారం తెలిపారు. సర్వే నంబర్లు 426–ఏ3, 427, 428 తదితర ప్రభుత్వ స్థలాల అన్యాక్రాంతంపై ఆక్రమణదారులపై 76 పేజీల రుజువులతో కూడిన పిటిషన్‌ను ఫైల్ చేశానన్నారు. ఇంతేకాకుండా అధికార పార్టీ నాయకులు, వారి అండతో స్థానిక రౌడీషీటర్ బోయ అశోక్ ద్వారా తనకు ప్రాణరక్షణ కల్పించాలని సైతం కోర్టులో కేసు వేశానన్నారు.

మిల్లు కార్మికులకు బకాయిలు చెల్లించాలి

గుంతకల్లు: పట్టణంలోని ఏసీఎస్ మిల్లు కార్మికులకు చెల్లించాల్సిన వీఆర్ఎస్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని మిల్లు కార్మిక పోరాట సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు టీసీ నారాయణరెడ్డి, టీ.వీరన్న మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. దాదాపు రూ.5.35 కోట్లు బకాయిల విషయమై మిల్లు కార్మిక సంఘం ఆధ్వర్యంలో సుప్రీమ్ కోర్టుకు ఆశ్రయించారన్నారు. ఇందుకు అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్పందించి మిల్లు కార్మికుల బకాయిల చెల్లించుటకు న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ ఆదేశాలు ఫిబ్రవరి 28న పంపారన్నారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న వీఆర్ఎస్ బకాయిలు చెల్లించడంతోపాటు నిరుపయోగంగా ఉన్న మిల్లును తెరపించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా కృషి చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.